# Swiya sikshana sadhanamu - 'Sangitasourabhamu'

# Swaragnani Sripada Pinakapani avishkaranamu

BheemasankarMaruvada, USA.

e-mail: shankar.maruvada@gmail.com

## Abstract

*Raga is a melody form and fundamental aspect in Carnatic music. Gamaka describes the characteristics of raga. Carnatic is preserved through detailed notations of compositions in various ragas depicting gamaka. Each notation represents a compositions in a specific raga, tala. SripadaPinakapanigaru tremendous efforts in bringing the art of music notations of many compositions with wonderful sangathi-s by giving equal importance to ragam, sahityam and bhakti bhava. He was a doyen of Carnatic music. Passionate learner of south Indian Tanjore style and brought the style (Bhani) to Andhra Pradesh. His work "SangitaSourabham" is helpful to music teachers as well as learners. His tremendous efforts in writing very detailed notation for popular and rare compositions and his love for music is an inspiration for generations.*

**keywords** - *Gamaka, Notation, SangitaSourabham, Bhani (style)*

**స్వీయ శిక్షణా సాధనము - 'సంగీత సౌరభము'**

**స్వరజ్ఞాని శ్రీపాద పినాకపాణి ఆవిష్కరణము**

**- భీమశంకర్ మరువాడ , యుఎస్ఏ**

**పరిచయం -** 'సంగీత జ్ఞానమను బ్రహ్మానంద సాగర మీదని దేహము భూమికి భారమురా'

- త్యాగరాజస్వామి

సప్తస్వరాలు పునాదులుగా విలసిల్లుతున్న భారతీయ సంగీత సంప్రదాయం ఉత్తరాదిన హిందూస్తానీ, దక్షిణాదిన కర్నాటక బాణీలుగా రూపుదిద్దుకుంది. భాష ఏదైనా అంతర్లీనంగా స్వరాల పోకడ మాత్రం ఒకటే.

ప్రత్యేకించి కర్నాటక శైలిలో స్వరస్థానాల ఆధారంగా లక్ష్య లక్షణకారులు జనక, జన్య వర్గీకరణ చేసి 40 వేలకు పైగా రాగాలను ఆవిష్కరించడం ప్రపంచంలోని మరి ఏ ఇతర సంగీత విధానంలో కనిపించని విశిష్టాంశం. కర్నాటక సంగీతానికి రాగమే జీవం. సంగీతం మౌకికంగా తరువాతి తరాల వారికి అందజేయబడుతోంది. అయితే రాగం మాధ్యమంగా అలంకరింపబడిన స్వరాలను ఖచ్చితంగా లెక్కించడం, గాత్రం లేదా వాయిద్యంలో పున: ప్రతిష్ట చేయడం కేవలం స్వరలిపి (నొటేషన్) ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఇతరులు పాడిన అంశాన్ని శ్రద్ధగా విని అలానే పాడటం కొందరికి మాత్రమే సాధ్యం. అలాకాకుండా సంగీతం నేర్చుకునే ప్రతి ఒక్కరూ ఏ అంశాన్నైనా ఉన్నది ఉన్నట్లు పాడాలంటే, వాయించి వినిపించాలంటే నొటేషన్ వ్రాయడం అనేది సాధనతో కూడుకున్న అంశమే కాకుండా సంగీతజ్ఞులకు అత్యంత ఆవశ్యకం. ఆధునికత ప్రభావం సంగీతంపై పడటంతో నొటేషన్ ద్వారా అనేక రచనలను గ్రంథస్థం చేసి పుస్తకాలు, ఆడియో, వీడియోల రూపంలో నిక్షిప్తం చేస్తున్నారు. కొంత మంది ఆధునిక సంగీతకారులు తమదైన శైలిలో నొటేషన్ వ్రాసి తరువాత తరాల వారికి పుస్తక రూపంలో అందించారు. ఆంధ్రదేశంలో నొటేషన్ వ్రాయడం అనే నూతన ఒరవడికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రతి సంగీత రచనకు అక్షరాలతో పాటు స్వరలిపి వ్రాసి పుస్తకాల రూపంలో నిక్షిప్తం చేసిన ఆధునిక వాగ్గేయకారుడు, నాదయోగి, కళాప్రపూర్ణ, సంగీత కళానిధి, పద్మభూషణ్ డా॥ శ్రీపాద పినాకపాణి. కాస్త సంగీత పరిజ్ఞానం వుంటే చాలు ఎవరి సహాయం అవసరం లేకుండా స్వయంగా రచనను నేర్చుకునేలా నొటేషన్ పద్ధతిని సులభతరం చేసిన స్వరజ్ఞాని. సంగీత సౌరభం పేరుతో నాలుగు సంపుటాల్లో త్యాగరాజాది వాగ్గేయకారుల కీర్తనలు, కృతులు, తాన, పద వర్ణములు, పదములు, జావళీలు, తిల్లానాలు వంటివి సుమారు వెయ్యికి పైగా రచనలకు నొటేషన్‌లను వ్రాసి భావితరాల వారి కోసం భద్రపరిచారు. సంగీత సౌరభం ఆయన రచనల్లో కీర్తిపతాకగా వెలుగొందుతోంది. దక్షిణాది తంజావూరు బాణీలో సుప్రసిద్ధులైన వీణ ధనమ్మాళ్ వద్ద ఆయన నేర్చుకున్న అనేక జావళీలు, పదాలను నొటేషన్ రూపంలో నిబద్ధం చేసి వెలలేని నిధిని మనకు అందించారు.

**ఉద్దేశం** - సంగీత సౌరభంలో సులభరీతిలో పినాకపాణిగారు రచించిన నొటేషన్ విధానాన్ని వివరించడం ద్వారా ఆయన కర్నాటక సంగీత రంగానికి చేసిన అప్రమేయమైన సేవను వివరించడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

**జీవిత విశేషాలు**

1913 ఆగష్టు 3వ తేదీన ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లాలోని ప్రియాగ్రహారంలో జోగమ్మ, కామేశ్వర రావులకు జన్మించారు. 1945 విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీ నుంచి ఎం.డి జనరల్ మెడిసిన్

Pranav Journal of Fine Arts
(A Peer Reviewed Quarterly Online Journal)
ISSN:2582-9513

పూర్తి చేశారు. 1949 వరకు మద్రాసు, ఆంధ్ర మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1957 లో కర్నూలు మెడికల్ కాలేజీకి బదిలీ అయిన తరువాత ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది 1968లో పదవీ విరమణ చేసి అక్కడే స్థిరపడ్డారు. 2013 మార్చి 11వ తేదీ వందేళ్ల వయస్సులో మృతి చెందారు. వైద్య వృత్తి లో అత్యవసర సేవలందిస్తూ గురుతర బాధ్యతలను నిర్వహిస్తూనే ప్రవృత్తిగా ఎంచుకున్న సంగీతంలో కూడా విశేష కృషి చేసిన నాదయోగి. వైద్య, సంగీత శాస్త్రాల సవ్యసాచిగా పేరు గడించారు. సంగీతంతో పాటు వైద్య రంగంలో కూడా ఉద్దండులను శిష్యులుగా తయారుచేశారు.

**గురువులు**

లక్ష్మణరావు, ద్వారం వెంకటస్వామి నాయుడు, ద్వారం నరసింగరావు, అరయకుడి రామానుజ అయ్యంగార్, రంగరామానుజ అయ్యంగార్, వీణ ధనమ్మాళ్.

**సంగీత రచనలు**

సంగీత సౌరభము నాలుగు సంపుటాలు, సంగీతయాత్ర, మేళరాగమాలిక, మనోధర్మ సంగీతము, పల్లవి గానసుధ, అభ్యాసమ్, స్వరరామమ్, ప్రవత్తి.

**బిరుదులు**

ది ఇండియన్ ఫైనార్ట్స్ సొసైటీ, చెన్నై నుంచి సంగీత శిఖామణి (1970), కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డ్ (1977), ఆంధ్రయూనివర్శిటీ నుంచి కళాప్రపూర్ణ (1978), మద్రాస్ మ్యూజిక్ అకాడమీ నుంచి సంగీత కళానిధి, భారత ప్రభుత్వం వారి పద్మభూషణ్ (1984), కేంద్ర సంగీత నాటక అకాడమీ వారి ఠాగూర్‌రత్న (2011), తిరుమల తిరుపతి దేవస్థానము వారి నుంచి జ్ఞాన విద్యా వారధి (2012) వంటి అత్యున్నత పురస్కారాలను, బిరుదులను అందుకున్నారు.

**శిష్యులు**

పద్మభూషణ్, మహామహోపాధ్యాయ డా॥ నూకల చిన సత్యనారాయణ, సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి, ఓలేటి వేంకటేశ్వర్లు, పద్మశ్రీ శ్రీరంగం గోపాలరత్నం, మల్లాది సూరిబాబు, మల్లాది బ్రదర్స్, జయలక్ష్మి శేఖర్, శ్రీపాద చిన్మయి సంగీత రంగంలో పాటు ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు డా॥ నోరి దత్తాత్రేయ, ప్రముఖ ఆర్థో నిపుణులు డా॥ జగన్నాథం వైద్య రంగంలో శిష్యులు.

**సంగీత సౌరభము రచన, ఆవశ్యకత**

పినాకపాణి గారి గానయజ్ఞ ఆవిష్కరణమే 'సంగీత సౌరభము'. తమిళ దేశంలో సంగీతానికి, సంగీత సభలకు వున్న ఆదరణ మన తెలుగునాట లేకపోవడం, ఇక్కడి శ్రోతల్లో శాస్త్రీయ సంగీతం పట్ల అభిరుచి అంతంత మాత్రంగా వుండటం ఆయనకు విచారం కలిగించింది. విలువైన సంగీత రచనలు మనకు లభ్యం కాకపోవడం ప్రధానమైన కారణం కావడంతో పాటు లభించినవి స్వరబద్ధం కాకపోవడం, నిర్దిష్టమైన పాఠాంతరం లేకపోవడం మరో కారణంగా గుర్తించారు. పెద్దలు పాడి ప్రచారం చేసిన సుమారు వెయ్యింటినైనా సేకరించి స్వర పరచి ఆంధ్రదేశంలోని యువతరానికి అందజేయగలిగితే కృతి సంపదతో పాటు సంగీత జ్ఞానము, సంగీత బాణీ అత్యున్నత స్థాయికి చేరుకుంటుందని భావించి ఈ గ్రంథ రచనకు పూనుకున్నారు. కర్నాటక శాస్త్రీయ సంగీతాభ్యాసకులకు స్వీయ శిక్షణా సాధనములా వుండేలా అన్నమా చార్యులు, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి, సుబ్బరాయశాస్త్రుల కీర్తనలు, కృతులు, క్షేత్రయ్య తదితర ప్రముఖులతో పాటు ధర్మపురి సుబ్బరాయర్, రామ్నాడ్ శ్రీనివాస అయ్యంగార్, పట్టాభిరామయ్య, తిరుపతి నారాయణస్వామి, వీణశేషన్న, సభాపతి అయ్యర్, తంజావూరు సోదరులు చిన్నయా పిళ్లై, పొన్నయ పిళ్లై, వడివేలు, అన్నైయ్య, కృష్ణస్వామయ్య, పులియూర్ దొరస్వామి, దాసు శ్రీరాములు, ముదికొండాన్ వెంక ట్రామయ్యర్ రచించిన పదాలు, జావళీలు, తిల్లానాలు, తిరుప్పుగళ్ ఇందులో స్వరబద్ధంగా నిక్షిప్తం చేయ బడింది. అలాగే అనేకమంది అజ్ఞాత వాగ్గేయకారుల రచనలను కూడా ఇందులో క్రోడీకరించడం విశేషం. గురుముఖత అధిక సంఖ్యలో ఆయన నేర్చుకున్న అంశాలతో పాటు ప్రముఖులు ఆలపించి, వాయించగా ఆడియో రూపంలో విన్న వాటికి తనదైన శైలిలో నొటేషన్ వ్రాసారు. తక్కినవి కొంత మంది విద్వాంసులు స్వయంగా పాడుతుంటే ఏమాత్రం పొల్లుపోకుండా నొటేషన్ వ్రాసుకున్నవి వున్నాయి. ఆయా సంపుటాల్లోని రచనలకు రాగలక్షణాలను అందరికీ అర్థమయ్యేలా మూర్ఛనాది వివరాలతో, గమక గుర్తుల వివరణ పట్టిక తో సమగ్రంగా చివరిలో చేర్చి సంపూర్ణత్వాన్ని కల్పించారు. ఇది వెలకట్టలేని పెన్నిధి. భావితరాలకు మార్గ నిర్దేశం చేసే స్వరశాస్త్ర దిక్సూచి. తిరుమల తిరుపతి దేవస్థానముల వారు ప్రచురించిన నాలుగు సంపు టాల ఈ సంగీత సౌరభం గ్రంథాన్ని 1996 నుంచి దశల వారీగా వెలువరించింది. ఇప్పటికి అనేక మార్లు పునర్ముద్రింపబడింది. ఇప్పటికీ వాసి పరంగా, రాశి పరంగా సంగీతాభిమానుల ఆదరాభిమానాలను చూర గొంటోంది.

**అనుస్వరాల ప్రాధాన్యత**

కర్నాటక సంగీతం స్వరాల గమకాలపై ఆధారపడి రాగానికి జీవత్వాన్ని కల్పిస్తుందని అందులోను అనుస్వరాల మేళవింపుతో రాగ భావం స్పష్టంగా ఆవిష్కృతమవుతుందని పాణి గారు గట్టిగా విశ్వసించారు. అందుకే అనుస్వరాలకు ప్రాధాన్యత కల్పిస్తూ చిక్కనైన స్వచ్ఛమైన సంగీతాన్ని నొటేషన్ రూపంలో నిబద్ధం చేసారు. కనీస సంగీత పరిజ్ఞానం వుంటే చాలు ఆయన రాసిన సంకేతాలు, గుర్తుల ఆధారంగా రచనలోని రాగభావ లక్షణాలు, తాళం నడక, కాలప్రమాణం, స్వరాల పోకడలను మనం అర్థం చేసుకోవచ్చు.

**పాణి గారు పొందుపరిచిన కొన్ని గమక గుర్తులు**

~~~ ఈ గుర్తు కంపిత, ఆందోళిత గమకములను సూచిస్తుంది.

/ \ ఈ గుర్తులు ‘ఎగుదాటు’, ‘దిగుదాటు’ తెలుపుతాయి.

Xఈ గుర్తు అన్యస్వరమును సూచిస్తుంది.

| ఒక్క నిలువు గీత తాళములోని అంగములను విభజిస్తుంది.

|| జంట నిలువు గీతలు తాళములోని ఆవర్తపు ముగింపును తెలుపుతాయి.

— స్వరముల పైన అడ్డగీత రెండవ కాలపు గుర్తు.

═ స్వరముల పైన జంట అడ్డగీతలు మూడవ కాలమును సూచిస్తాయి.

, ఒక కామా ఒక అక్షర సూచన

; ఈ సెమీకోలన్ గుర్తు రెండక్షరముల సూచన.

( . ) చుక్క గుర్తు స్వరాక్షరము మీద వుంటే తారస్థాయిని, క్రింద వుంటే మంద్ర స్థాయిని తెలుపుతుంది.

మొదటి సంపుటంలో 15 తాన వర్ణములు, 25 అన్నమయ్య సంకీర్తనలు, 151 త్యాగరాజాది రచయితల కృతులు, 44 దీక్షితుల వారి కృతులు, 10 శ్యామశాస్త్రి, సుబ్బరాయశాస్త్రుల కృతులు, 10 పదములు, 10 జావళీలు, 2 తిల్లానాలు, 4 తిరుప్పుగళ్ మొత్తం 271 సంగీత రచనలు చేర్చబడినవి. ఈ సంపుటములో వాడిన 110 రాగాలకు లక్షణములు వ్రాసారు.
~~~

రెండవ సంపుటములో 15 తాన, పద వర్ణములు, 31 అన్నమాచార్య సంకీర్తనలు, త్యాగరాజాది రచయితల కృతులు 155, ముత్తుస్వామి దీక్షితుల కృతులు 50, శ్యామశాస్త్రి, సుబ్బరాయ శాస్త్రుల వారి కృతులు 14, పదములు 12, జావళీలు 12, తిల్లానాలు 3, తిరుప్పుగళ్ 4 మొత్తము 296 రచనలతో పాటు 51 రాగాలకు సంక్షిప్త రాగ లక్షణ వివరాలు చేర్చబడింది.

మూడవ సంపుటంలో తాన, పద వర్ణములు 14, అన్నమాచార్య సంకీర్తనలు 30, త్యాగరాజాది రచయితల కృతులు 135, ముత్తుస్వామి దీక్షితుల కృతులు 46, శ్యామశాస్త్రి, సుబ్బరాయ శాస్త్రుల కృతులు 11, క్షేత్రయ్య తదితరులు రచించిన పదములు 14, జావళీలు 4, తిల్లానాలు 3, తిరుప్పుగళ్ 4 మొత్తం 271 రచనలతో పాటు 49 రాగ లక్షణాలను జతచేసి అందించారు.

నాల్గవ సంపుటంలో తాన,పద వర్ణములు 13, అన్నమాచార్య సంకీర్తనలు 23, త్యాగరాజాది రచయితల కృతులు 177, ముత్తుస్వామి దీక్షితుల కృతులు 35, పదములు 8, జావళీలు 15, తిల్లానాలు 2, తిరుప్పుగళ్ 4 మొత్తము 277 రచనలు పొందుపరచబడినవి.

**విశేషాంశాలు - వివరణ**

1.. 'ఆడెనమ్మ హరుడు దృగుడ్తతయ్యని' పులియూర్ దొరస్వామి అయ్యంగార్ రచన ఫరజ్ రాగంలో, అతి చిత్రతమ మార్గంలో నొటేషన్ రెండవ కాలంలో వ్రాసియున్నారు. 'నవరసంబు లొలుక మోము చిరునవ్వు ముద్దు గులుక' అనే పంక్తి వద్ద ముచ్చటగా మూడు సంగతులతో శివుడి నృత్యాన్ని సంగీతంతో వర్ణించి సంగీతాభిమానులను ముగ్దులను చేసే పాణి గారి భావనా స్వర సంపద అమోఘం. తెలుగు భాషలోని అందాన్ని స్వరాల ద్వారా సొబగులద్ది మరింత ఇనుపడింప చేసిన విధానం అనిర్వచనీయం.
(1వ సంపుటం 133వ పేజీ)

2. 'అప్పరామభక్తి ఎంతో' పంతువరాళి నొటేషన్ నేటి విద్యార్థినీ విద్యార్థులు అలవోకగా పాడుకునే విధంగా స్వరపరిచారు. (1వ సంపుటం 123వ పేజీ)

3. 'అనుదినమును కావుమయ్య' రామ్నాడ్ శ్రీనివాసయ్యంగార్ బేగడ రాగంలోని రచనకు చిట్టస్వరం బేగడ రాగంలోని మీగడను ఆస్వాదిస్తూ మృదంగ జతుల విన్యాసంలా స్వరాల కూర్పును తల్చుకుని ఆహా అనాల్సిందే. (1వ సంపుటం 111వ పేజీ)

గా ; ; మపద మపమ ॥ గమపగమరి సరినీదప ॥ సా ; ; పసని సమగ ॥ సపమ దపద మగరి సగరి ॥

గమా పదని దనీదపమ ॥ దపమగామ రిగమపదప ॥ సనిరిస గరి గమాగరిస ॥ రినీదపమదమాగమరి ॥

రచన ఒక ఎత్తయితే ఈ చిట్టస్వరం ఇంకో ఎత్తయి సౌరభాన్ని గుర్తు చేస్తుంది.

4. త్యాగరాజస్వామి 'రామబాణ త్రాణ శౌర్యమెంతని పొగడుదునని' సావేరి రాగంలో రాముణ్ణి కీర్తించారు. వీరుల బాణములు వారి శక్తి కొలది ప్రయోగించి శత్రుసంహార మొనర్చిన విషయం సర్వసాధారణము, సహజం. రామబాణ మట్లు కాక ఒక ప్రత్యేకతను కలిగియున్నది. రామబాణము, రాముని వ్యక్తిత్వము పర స్వరం ఎంతో ఔన్నత్యము కలవి. శత్రువులను సంహరించిన పిదప వారికి సద్గతిని కలుగజేయునది రామ బాణము. కరుణరస ప్రధానమైన సావేరి రాగంలో రామబాణ మహిమను వర్ణించడం ఒక విశేషమైతే, పినాకపాణి గారు ఆ వర్ణనకు అనుగుణంగా సంగతులను ఏర్పరచి నొటేషన్ ద్వారా స్పష్టంగా మరపురాని భావంగా మన మనసులో ఆవిష్కరింపజేయడం గమనించదగ్గ విషయం. (3వ సంపుటం 333వ పేజీ)

5. సంగీత రసికులు పాడుకునే విధంగా 'మాయాతీత స్వరూపిణి నన్ను బ్రోవవే' మాయామాళవగౌళ రాగం రూపకతాళంలో ఆనైయ, అయ్య సోదరుల రచనలోని సంగతులు అలరిస్తాయి.
(3వ సంపుటంలో 252వ పేజీ)

6. 'మహిమ తెలియ తరమా' శంకరాభరణం రాగంలో ఆనైయ-అయ్య రచన అలనాటి సంగీత విద్వాంసు లు సభలలో తరచుగా పాడిన విధానాన్ని స్పష్టం చేస్తుంది. వీణ వాయిస్తూ పాడుతూ శంకరాభరణంలోని దివ్యమైన సంగతులను రూపక తాళంలో బంధించిన వీణ ధనమ్మాళ్ బాణీని అందంగా పాణి గారి సంగతు ల్లో దర్శించే అదృష్టాన్ని కలుగజేశారు. (3వ సంపుటంలో 227వ పేజీ)

7. త్యాగరాజస్వామి మలయమారుతం రాగంలో 'మనసా ఎటులోర్తునే' అంటూ లలిత పద విన్యాసంతో మ నస్సు ను బతిమాలుకున్న తీరు, రాముని భజన మానవ సహజమైన సంపద అంటూ మనస్సుకు విన్నవించే తీరును సరళమైన సంగతులతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో మలచిన తీరు అద్భుతం.
(3వ సంపుటంలో 186వ పేజీ)

8. 'ఈ వసుధ నీ వంటి దైవము' త్యాగరాజస్వామి వారి కృతిలో కోవూరు సుందరేశుని వర్ణన పాణి గారి సు ందర సంగతులు కృతజ్ఞతతో కంటతడిపెట్టిస్తుంది. (1వ సంపుటం 173వ పేజీ)

**9. 'అపుడు మనసు' - కమాస్ రాగం - రూపక తాళం - (జావళి) పట్నం సుబ్రహ్మణ్యయ్యర్ రచన**

(1వ సంపుటంలో 650వ పేజీ)

**శుద్ధసాహిత్యము**

**పల్లవి** - అపుడు మనసు నిలుచునటే - అతివరో అదేటి మాట

**అనుపల్లవి** - చపలమెట్టి దెటువంటి సామర్థ్యము గల వారైన ॥ అపుడు ॥

**1వ చరణము** - చొక్కపు యవ్వనము గల

ప్రక్క జేరి సరసమాడి బల్కుచు కనుసైగ జేయగ ॥ అపుడు ॥

**2వ చరణము** - వరద వేంకటేశ్వరుడిటు - సురత సంభ్రమము తెలిసి

తరుణ మెరిగి మారుడు విరి - శరముల బిరబిర కురియగ ॥ అపుడు ॥

ప॥ ; పపాద రి స నీదా || పద ద ప మా గా మా˜;||

. అపుడు మ . నసు || ని . లు . చు న టే . ||

; గగారి మగగరిసా|| స మగామా ని ద ద మమా;||

. అతివ రో . . . అ|| దే . . టి మా . . . ట ||

2) ; పదాని రి సనిదపా || మపదానిదప మగామా;||

. అపుడు మ . న . సు || ని . లు . . . చు న టే . ||

;రిమాగ రిససా, గమ |పదాప దని రిస ని*ద దప||

;అ తివ రో . అ . |దే . . టి . మా . . . ట .||

3) మా పదాని సారిస నిదపా||సని*దప పమమా రిగా, మా˜˜˜;||

. అపుడు మ. . న . సు||ని . లు . చు . . న . . టే . ||

; రిమాగ రిససా గమ|| పదనిసగరి  రిస నిద పని||దమ

. అతి వ రో . .  అ .  || దే . . . . టి మా . . . ట . || . .        - అపుడు ....

పట్నం సుబ్రహ్మణ్యయ్యర్ రచించిన ఈ జావళి శృంగార రస ప్రధానమైన కమాస్ రాగంలో వుంది. అందుకు తగిన విధంగా కమాస్ రాగంలోని రంజక ప్రయోగాలతో స్పష్టంగా మలిచారు. అన్యస్వరమైన కాకలి నిషాదాన్ని పల్లవిలోని మూడవ సంగతిలో సందర్భోచితంగా భావోద్వేగ స్థాయిని చూపడంలో ఉపయోగించారు. రచనలో ఎక్కడా మంద్రస్థాయి ప్రయోగం కనిపించదు.  మధ్యమానికి వున్న గమక ప్రాధాన్యతను మనం నొటేషన్ విధానంలో చూడవచ్చు.. గమక గుర్తులతో పరిపూర్ణమైన నొటేషన్ విధానం లో పొందుపరిచిన పాణి గారి బాణీ ఈ జావళిలో మనకు అర్థమవుతుంది. మన్మథ శరాలను బిరబిరా కురిపిస్తూ సాగిన పాణి గారి కమాస్ రాగ సంగతులపై మన మనస్సు నిలుస్తుంది. మధురభక్తికి అనువైన సంగతులను అందంగా జోడించి రాగభావాన్ని ఆవిష్కరించారు.

అదే కోవలోనే 1వ సంపుటంలో క్షేత్రయ్య పదం ఎవతె తాళునమ్మా - అఠాణా రాగ (పేజీ నెం.643), చెలినేనెట్లు సైరింతునే ఫరజ్ రాగం జావళి (పేజీ నెం. 658) మనం పరికిస్తే ధృత, విలంబ కాల రచనలకు నొటేషన్ వ్రాసే విధానంలో వుండే సూక్ష్మమైన తేడాలు మనకు కనిపిస్తాయి.

**ముగింపు**

పినాకపాణి గారి సంగీత సౌరభం నాలుగు సంపుటాలు నాలుగు మహాసాగరాలు. సంగీతాభిమానులకు ఈ మహాసముద్రాలను ఈదడం కష్టమైన పని. ఆ స్వర సాగర తరంగాలను ఆస్వాదిస్తూ ఆహ్లాదాన్ని పొందవచ్చు. సాగరంలో విలువైన నిధి నిక్షేపాలు వున్నట్లే సంగీత సౌరభంలో ఎంతో స్వరరాగ సంపదను పాణి గారు నిక్షిప్తం చేసారు. దాన్ని మనం అందిపుచ్చుకునే ప్రయత్నం చేయడానికి సులభతరమైన నొటేషన్ విధానాన్ని తరతరాలకు  దిక్సూచిగా అందించారు.

**ఉపయుక్త గ్రంథ సూచి**

సంగీత సౌరభము, ప్రథమ సంపుటం, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి 2000

సంగీత సౌరభము, రెండవ సంపుటం, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి 2002

సంగీత సౌరభము, మూడవ సంపుటం, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి 2001

సంగీత సౌరభము, నాలుగవ సంపుటం, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి 2001

పినాకపాణి వికీపీడియా